ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER APTEL/2014/58382

10-05-2026

మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 133 పేజీలు-04 వెల-రూ.1

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD ఆదివారం WWW.EPAPER.MAHAADAILY.COM



# రిజిస్ట్రేషన్ల రద్దీ

## 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనివేళల పెంపు

స్లాట్ల సంఖ్య పెంచాలని మంత్రి పొంగులేటి ఆదేశం

కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు


వ్యవసాయ భూములకూ స్లాట్లు పెంచే దిశగా రెవెన్యూ శాఖ కసరత్తు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణకు రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల తీసుకున్న కీలక నిర్ణయం నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఒక్కసారిగా రద్దీ పోటెత్తింది. కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే ప్రభుత్వ ధరల్లో భారీగా హెచ్చుతగ్గులు ఉండటంతో వాటిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరిణామంతో కొత్త ధరలు అమలులోకి రాకముందే తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకోవాలనే ఉద్దేశంతో కొనుగోలుదారులు పెద్ద ఎత్తున కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఈ అసాధారణ రద్దీని దృష్టిలో ఉంచుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు.

మిగతా 2లో

## టాప్ న్యూస్


### పుతిన్ హత్యకు భారీ కుట్ర!



- ప్రాణ భయంతో బంకర్లలోకి రష్యా అధ్యక్షుడు
- ఇంటర్నెట్ బంద్.. పబ్లిక్ ఈవెంట్స్ రద్దు
- అత్యంత గోప్యంగా భూగర్భంలో మకాం

02

### ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ




- ఉత్వర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

02

### ప్రధానమంత్రి కార్యక్రమాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



- ఆహ్వాన పత్రిక అందజేసిన జాతీయ రహదారుల శాఖ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్

02

# నేడు రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ



## రూ. 9,400 కోట్లతో అభివృద్ధి పనులు

- జహీరాబాద్, వరంగల్ పారిశ్రామిక రంగాలకు మహర్దశ
- రహదారులు, రైల్వే కనెక్టివిటీ, వైద్య రంగానికి పెద్దపీట
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన సభా వేదికలు
- మధ్యాహ్నం 3 గంటలకు నగరానికి రాక
- సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ
- అణువణువూ ఉక్కు కవచంలా భద్రత
- గగనతలంలో డ్రోన్లపై కఠిన నిషేధం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రగతి రథచక్రాలకు మరింత వేగం జతచేస్తూ, అభివృద్ధి అజెండాను పరుగులు పెట్టించేందుకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం రాష్ట్రానికి విచ్చేస్తున్నారు. ముచ్చటగా మూడోసారి దేశ ప్రధానిగా అత్యున్నత బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తెలంగాణ గడ్డపై అడుగుపెట్టడం ఇదే తొలిసారి కావడంతో సర్వత్రా తీవ్ర ఆసక్తి నెలకొంది. రాష్ట్ర ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసేలా, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ ఏకంగా రూ. 9,400 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు ప్రధాని మోదీ లాంఛనంగా శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పనులను జాతికి అంకితం చేయనున్నారు. ఒకవైపు పాలనాపరమైన కార్యక్రమాలతో రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తూనే, మరోవైపు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా తలపెట్టిన భారీ బహిరంగ సభ ద్వారా రాజకీయంగానూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి ఆతిథ్యం ఇచ్చేందుకు మహానగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

మిగతా 2లో

### పారిశ్రామిక ప్రగతికి ఊపిరిపోస్తూ..

రాష్ట్రంలో పెట్టుబడుల వరద పారించేలా, యువతకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రధాని ఈ పర్యటనలో అద్భుతమైన ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంత రూపురేఖలను మార్చేసే 'స్మార్ట్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్' ప్రాజెక్టుకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. భవిష్యత్తులో ఆటోమొబైల్, భారీ యంత్ర పరికరాలు, లోహ, ఆహార శుద్ధి పరిశ్రమలకు ఈ టౌన్‌షిప్ కేంద్ర బిందువుగా మారనుంది. దీని ద్వారా పదివేల కోట్ల రూపాయల మేర భారీ పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. అలాగే, పీఎం మిత్ర పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించే ఉద్దేశంతో వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దిన 'కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్'ను ప్రధాని లాంఛనంగా ప్రారంభించి నేతన్నలకు సరికొత్త ఆశలు కల్పించనున్నారు.

### పవన్ నివాసానికి ప్రధాని మోదీ

- ప్రోటోకాల్ పక్కనపెట్టి ఆత్మీయ భేటీ
- జనసేనాని ఇంట ప్రధాని విందు
- మోదీ-పవన్ భేటీపై సర్వత్రా ఉత్కంఠ

వివరాలు 2లో



# విశ్వనగరంగా హైదరాబాద్

## ట్రాఫిక్ ఫ్రీ సిటీ దిశగా అడుగులు

- 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ!
- కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్
- మూసీ నది పునరుజ్జీవంపై కేంద్ర కమిటీ ప్రశంసలు
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మహానగరాన్ని భవిష్యత్తు సవాళ్లకు దీటుగా, ట్రాఫిక్ రహిత, కాలుష్య రహిత విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీతో జరిగిన అత్యంత కీలక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తదితర కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరైన ఈ ఉన్నత స్థాయి భేటీలో ముఖ్యమంత్రి తమ ప్రభుత్వ భవిష్యత్ దార్శనికతను సాక్ష్యాధారాలతో, పక్కా ప్రణాళికలతో కళ్లకు కట్టారు. పెరుగుతున్న నగరీకరణ రేటును దృష్టిలో ఉంచుకుని పాత పద్ధతులకు స్వస్తి పలికి, రాబోయే దశాబ్దాల అవసరాలకు సరిపడా మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టామని, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు వెన్నుదన్నుగా నిలవాలని ఆయన సవివరంగా ప్రజెంటేషన్ ఇచ్చారు.

మిగతా 2లో



# పశ్చిమ బెంగాల్‌లో కమల వికాసం

## 9వ ముఖ్యమంత్రిగా సువేందు ప్రమాణస్వీకారం

- సోనార్ బంగ్లా యుగం షురూ
- మమతా బెనర్జీ పాలనకు ముగింపు పలికిన బీజేపీ
- 98 ఏళ్ల సీనియర్ నేత కాళ్లు మొక్కిన ప్రధాని మోదీ
- కోల్‌కతాలో అంగరంగ వైభవంగా ఎన్డీయే పండుగ
- హాజరైన చంద్రబాబు, యోగి

**హైదరాబాద్, మహా:** పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో నూతన అధ్యాయం మొదలైంది. గత పదిహేనేళ్లుగా కొనసాగిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పాలనకు తెర దించుతూ ఆ రాష్ట్రంలో తొలిసారిగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం కొలువుదీరింది. బెంగాల్ 9వ ముఖ్యమంత్రిగా బీజేపీ శాసనసభా పక్ష నేత

మిగతా 2లో

# అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా

- నాగారంలో అక్రమ నిర్మాణాల జోరు
- పట్టణ ప్రణాళిక నిబంధనలకు తూట్లు
- అధికారుల పర్యవేక్షణ లోపంతో యథేచ్ఛగా బహుళ అంతస్తులు
- నోటీసులతో సరిపెడుతున్నారని స్థానికుల ఆగ్రహం



**కుషాయిగూడ, మహా:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పట్టణ ప్రణాళిక నిబంధనలను పక్కనపెట్టి కొందరు నిర్మాణదారులు బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తుండగా, సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారి పక్కన బాలాజీ మహేష్ మిఠాయి బండారు యజమాని చేపడుతున్న భవన నిర్మాణం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

మిగతా 2లో

# ఎట్టకేలకు లైన్ క్లియర్

## ద్రవిడ గడ్డపై తళపతి శకం

- నేడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం
- దశాబ్దాల ద్విధ్రువ రాజకీయాలకు చెక్
- కొలువుదీరనున్న టీవీకే సంకీర్ణ సర్కారు
- రాజ్‌భవన్ ఉత్కంఠకు తెర
- మిత్రపక్షాల మద్దతుతో 120కి చేరిన కూటమి బలం
- నెహ్రూ ఇండోర్ స్టేడియానికి పోటెత్తుతున్న అభిమాన లోకం
- చెన్నైలో పండుగ వాతావరణం
- సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించిన రాజకీయాలు

**హైదరాబాద్, మహా:** తమిళనాడు రాజకీయ చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ప్రారంభం కాబోతోంది. దశాబ్దాలుగా ద్రావిడ పార్టీల ఆధిపత్యంలో ఉన్న రాష్ట్రంలో సరికొత్త ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అధికార పీఠాన్ని అధిరోహించబోతోంది. దశాబ్దాలుగా డీఎంకే, అన్నాడీఎంకేల చుట్టూ తిరిగిన తమిళ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం లిఖిస్తూ అశేష ప్రజానీకం, అభిమానుల ఆకాంక్షల మధ్య తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, సినీ అగ్ర కథానాయకుడు విజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పరిపాలనా పగ్గాలు చేపట్టనున్నారు. వారం రోజులుగా సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించిన రాజకీయ ఉత్కంఠకు తెరదించుతూ, మిత్రపక్షాల సంపూర్ణ మద్దతుతో ఆయన

మిగతా 2లో



# నేడు రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామిక అభివృద్ధితో పాటే మౌలిక రవాణా వసతుల కల్పనపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌పనాజీ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో అత్యంత కీలకమైన 167వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు ప్రధాని పచ్చజెండా ఊపనున్నారు. సుమారు రూ. 3,175 కోట్లకు పైగా భారీ వ్యయంతో గుడెబెల్లూరు నుంచి మహబూబ్‌నగర్ వరకు ఈ నాలుగు లేన్ల రహదారిని నిర్మించనున్నారు. అలాగే పెరుగుతున్న ఇంధన డిమాండ్‌ను తీర్చేందుకు నగర శివారులోని మల్కాపూర్‌లో రూ. 600 కోట్లతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్మించిన 'గ్రీన్‌ఫీల్డ్ టెర్మినల్' ప్రాజెక్టును దేశ ప్రజలకు అంకితం చేయనున్నారు. దేశంలోనే అత్యంత రద్దీ మార్గమైన గ్రాండ్ ట్రంక్ రైల్వే కారిడార్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించేందుకు ఖాజీపేటవిజయవాడ మధ్య రూ. 1,535 కోట్లతో చేపట్టిన 118 కిలోమీటర్ల మల్టీ ట్రాకింగ్ సిస్టమ్ ప్రాజెక్టును కూడా ఈ పర్యటనలోనే ప్రధాని ప్రారంభించనున్నారు. వైద్య రంగంలో అత్యాధునిక క్యాన్సర్ సేవలు అందించేలా ఏర్పాటు చేసిన మల్టీ సూపర్ స్పెషాలిటీ క్యాటర్నరీ కేర్ 'సింధు ఆసుపత్రి' సైతం ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం కానుంది.

**నిమిషాల మీద సాగనున్న పర్యటన.. పకడ్బందీ ఏర్పాట్లు**

ప్రధాని మోదీ పర్యటన అత్యంత పకడ్బందీగా, కచ్చితమైన షెడ్యూల్ ప్రకారం సాగనుంది. ఆదివారం ఉదయం బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమంలో జరిగే 45వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని, అక్కడ నూతన ధ్యాన్ మందిర్‌ను ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రత్యేక విమానంలో బయలుదేరుతారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి నేరుగా గచ్చిబౌలిలోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్‌ఐసీసీ)కి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్త ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3:45 గంటల సమయంలో క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించి వైద్యులతో ముచ్చటిస్తారు. ఈ అధికారిక కార్యక్రమాలన్నీ ముగిసిన వెంటనే, సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు చేరుకుంటారు.

**ఉక్కు కవచంలా భద్రత.. పోలీసుల అప్రమత్తత**

ప్రధాని రాక సందర్భంగా నగరంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీజీ, ఇంటెలిజెన్స్ అధికారుల పర్యవేక్షణలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఉక్కు కవచం లాంటి భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసింది. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రధాని ప్రయాణించే మార్గాలతో పాటు, హెచ్‌ఐసీసీ, పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలను తమ అధీనంలోకి తీసుకుంది. సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని పలు కీలక ప్రాంతాలను 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రోన్లు, పారా గ్లైడర్లు వినియోగించరాదని కఠిన ఆంక్షలు విధించారు. సభకు వచ్చే లక్షలాది మంది ప్రజలు, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరంలోని పలు ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. మొత్తానికి ప్రధాని రాకతో అటు పాలనా యంత్రాంగంలో, ఇటు రాజకీయ వర్గాల్లో సరికొత్త కోలాహలం నెలకొంది.

# పుతిన్ హత్యకు భారీ కుట్ర!

**మహా :** ఒకప్పుడు తన కనుసన్నలతో ప్రపంచ గతిని శాసించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. ఇప్పుడు ప్రాణ భయంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉక్రెయిన్‌పై ఆయన స్వయంగా ప్రకటించిన యుద్ధం, ఇప్పుడు ఆయనకే ముచ్చెమటలు పట్టిస్తోంది. తనను అంతమొందించేందుకు భారీ స్థాయిలో కుట్రలు జరుగుతున్నాయన్న పక్కా ఇంటెలిజెన్స్ నివేదికల నేపథ్యంలో, క్రెమ్లిన్ బాస్ మునుపెన్నడూ లేని విధంగా తీవ్ర అభద్రతాభావానికి లోనయ్యారు. రాజధాని మాస్కోలోని అధికారిక నివాసాలను విడిచిపెట్టి, క్రాస్నోడార్ ప్రాంతంలోని అత్యాధునిక సౌకర్యాలున్న అజ్ఞాత భూగర్భ బంకర్లకే ఆయన పూర్తిగా పరిమితమయ్యారని ఫైనాన్షియల్ టైమ్స్ మరియు యూరోపియన్ నిఘా సంస్థల తాజా నివేదికలు సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చాయి. గత ఏడాది ఇదే సమయానికి 17 పబ్లిక్ ఈవెంట్లలో పాల్గొన్న పుతిన్, ఈ ఏడాది కేవలం రెండు సార్లు మాత్రమే బయటకు రావడం ఆయనలోని భయానికి అద్దం పడుతోందని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తోంది.

పుతిన్‌ను ఇంతలా భయపెడుతున్న ప్రధాన అంశం ఉక్రెయిన్ డ్రోన్ దాడులు. ముఖ్యంగా రష్యా సరిహద్దుల్లోకి చొరబడి ట్రక్కుల ద్వారా 117 డ్రోన్లను ప్రయోగించి 40కి పైగా రష్యన్ బాంబర్ విమానాలను ధ్వంసం చేసిన ఉక్రెయిన్ ప్రతిష్టాత్మక దాడి "ఆపరేషన్ స్పైడర్‌వెబ్" తాలూకు షాక్ నుంచి క్రెమ్లిన్ ఇంకా కోలుకోలేదు. ఇటీవలి కాలంలో ఏకంగా మాస్కో గగనతలంలోకి సైతం ఉక్రెయిన్ డ్రోన్లు చొరబడి క్రెమ్లిన్‌కు అత్యంత సమీపంలో దాడులకు పాల్పడటం రష్యా రక్షణ వలయంలోని డొల్లతనాన్ని బయటపెట్టింది. దీనికి తోడు 2026 జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బలగాలు టార్గెట్ చేయడం వంటి పరిణామాలు పుతిన్‌ను మరింత కలవరపెడుతున్నాయి. తన ప్రైవేట్ నివాసం వద్ద కూడా డ్రోన్ల ద్వారా హత్యాయత్నం జరిగిందన్న వార్తల నేపథ్యంలో.. ఆయన తన దైనందిన కార్యకలాపాలను పూర్తిగా బంకర్లకే పరిమితం చేసి, తన సమయంలో 70 శాతానికి పైగా కేవలం యుద్ధ వ్యూహాలకే కేటాయిస్తున్నారని సమాచారం.

కేవలం శత్రు దేశం ఉక్రెయిన్ మాత్రమే కాకుండా, రష్యాలోని తన సొంత రాజకీయ, సైనిక ఎలైట్ వర్గాల నుంచే తనకు ముప్పు పొంచి ఉందని పుతిన్ తీవ్రంగా అనుమానిస్తున్నారు. రష్యా లెఫ్టినెంట్ జనరల్ ఫానిల్ సర్వరావ్ మాస్కోలో అనుమానాస్పద స్థితిలో మరణించడం, అలాగే రష్యా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ అలెగ్జాండర్ బోర్ట్నికోవ్ మరియు జనరల్ స్టాఫ్ చీఫ్ వాలెరీ గెరాసిమోవ్‌ల మధ్య తలెత్తిన ఆధిపత్య పోరు క్రెమ్లిన్‌లో అంతర్గత తిరుగుబాటు భయాలను పెంచుతున్నాయి. సైనిక వైఫల్యాలకు రక్షణ శాఖదే బాధ్యత అని ఒకరు, కాదు ఇంటెలిజెన్స్ వైఫల్యమే అని మరొకరు పరస్పరం విమర్శలు చేసుకుంటున్న తరుణంలో..పుతిన్ తన నీడను కూడా నమ్మలేని స్థితికి చేరుకున్నారు.దేశంలోని పౌర పరిపాలనా వ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసి, కింది స్థాయి అధికారులను కలవడం కూడా ఆయన మానేశారని రష్యన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో రష్యా ఫెడరల్ ప్రొటెక్టివ్ సర్వీస్ పుతిన్ భద్రతను అత్యంత కఠినతరం చేసింది. ఆయన చుట్టూ ఉండే వంటగాళ్లు, బాడీగార్డ్స్, ఫోటోగ్రాఫర్లు ఎవరూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడకుండా నిషేధం విధించారు. పుతిన్ ఉన్న పరిసరాల్లో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న పరికరాలను పూర్తిగా బ్యాన్ చేశారు. పైగా ఆయన వ్యక్తిగత సిబ్బంది ఇళ్లలో కూడా నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఉక్రెయిన్ డ్రోన్లను పసిగట్టేందుకు మాస్కో నది వెంబడి భారీగా డాగ్ స్క్వాడ్ (కనైన్ యూనిట్స్) యాంటీడ్రోన్ సిస్టమ్స్‌ను మోహరించారు. తాను బంకర్లలో తలదాచుకున్న విషయం బయట ప్రపంచానికి తెలియకుండా ఉండేందుకు, రష్యన్ స్టేట్ మీడియా ద్వారా తన పాత వీడియో ఫుటేజీలను ప్రసారం చేయిస్తూ.. తాను ప్రజల మధ్యే ఉంటూ పాలన సాగిస్తున్నాననే ఒక ఫేక్ ఇమేజ్‌ను క్రియేట్ చేసే ప్రయత్నం జరుగుతోంది.

సామ్రాజ్య విస్తరణ కాంక్షతో పొరుగు దేశంపై యుద్ధానికి దిగిన రష్యా అధ్యక్షుడు, ఇప్పుడు తన ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతుండటం కాలం తెచ్చిన అతి పెద్ద మార్పు. ప్రపంచ దేశాలను గడగడలాడించిన క్రెమ్లిన్ ఇనుప పాదం.. ఇప్పుడు స్వదేశంలోనే, సొంత మనుషుల మధ్యే అభద్రతతో కుంగిపోతోంది. ఒకవైపు అజేయంగా దూసుకొస్తున్న ఉక్రెయిన్ డ్రోన్లు, మరోవైపు ఎటునుంచి ఏ కుట్ర ముంచుకొస్తుందో తెలియని అంతర్గత రాజకీయ సంక్షోభం.. వెరసి వ్లాదిమిర్ పుతిన్ భవిష్యత్తును అత్యంత ప్రశ్నార్థకంగా మార్చేశాయి. ఈ పరిణామాలు రష్యాఉక్రెయిన్ యుద్ధంలో ఒక కీలక మలుపుగా మారే అవకాశం ఉందని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే క్రెమ్లిన్ కోటలో ఊహించని రాజకీయ భూకంపం రావడం ఖాయమని అంతర్జాతీయ రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని నెలల క్రితం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుండటంతో మున్సిపల్ అధికారులు భవన స్లాబ్ కు రంధ్రాలు పెట్టి పనులు నిలిపివేసినప్పటికీ, ప్రస్తుతం అదే భవనంపై మళ్లీ స్లాబ్‌లు వేసి నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వచ్చి నోటీసులు జారీ చేయడం తప్ప, నిర్మాణాన్ని పూర్తిగా అడ్డుకునే చర్యలు తీసుకోవడం లేదని వారు మండిపడుతున్నారు.

**సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణాలు**

నాగారం ప్రధాన రహదారితో పాటు అంతర్గత కాలనీలకు వెళ్లే మార్గాల్లో ఇప్పటికే ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో కనీస సెట్‌బ్యాక్లు కూడా వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రోడ్లకు ఆనుకుని భవనాలు నిర్మించడంతో ట్రాఫిక్ అంతరాయం పెరుగుతోందని, అత్యవసర సమయాల్లో అగ్నిమాపక వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ మార్గాలను ఆక్రమించడంతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**అధికారుల కళ్లముందే ఉల్లంఘనలు**

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నా అధికారులు సమయానికి తనిఖీలు నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయం నాగారం డివిజన్‌కు దూరంగా ఉండటాన్ని కొందరు నిర్మాణదారులు అనుకూలంగా మార్చుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో వేగంగా స్లాబ్‌లు వేసి, అధికారులు వచ్చేలోపే పనులు పూర్తి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. "అధికారులు వచ్చి నోటీసులు ఇస్తారు.. వెళ్లిపోతారు.. ఆ తర్వాత మళ్లీ పనులు మొదలవుతాయి. కఠిన చర్యలు తీసుకోవాల్సిన వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు" అంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు నిర్మాణదారులు రాజకీయ పలుకుబడితోనే నిబంధనలను ధిక్కరిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

**ప్రజలకు పెరుగుతున్న ఇబ్బందులు**

అక్రమ నిర్మాణాల కారణంగా వెనుక వైపున ఉన్న కాలనీలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. రహదారుల వెడల్పు తగ్గిపోవడంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. నిర్మాణ వ్యర్థాలను రోడ్లపైనే వేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ డిమాండ్**


ఇప్పటికే పలు దినపత్రికల్లో అక్రమ నిర్మాణాలపై కథనాలు వెలువడినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న నిర్మాణదారులతో పాటు నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని నాగారం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పవన్ నివాసానికి ప్రధాని మోదీ

- ప్రోటోకాల్ పక్కనపెట్టి ఆత్మీయ భేటీ
- జనసేనాని ఇంట ప్రధాని విందు
- మోదీపవన్ భేటీపై సర్వత్రా ఉత్కంఠ

**హైదరాబాద్, మహా:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ తన రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసానికి విచ్చేస్తుండడం ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా దేశాధినేతలు రాష్ట్ర పర్యటనలకు వచ్చినప్పుడు కేవలం అధికారిక కార్యక్రమాలకు లేదా రాజ్‌భవన్‌కు మాత్రమే పరిమితమవుతారు. అయితే, అన్ని ప్రోటోకాల్ నిబంధనలను పక్కన పెట్టి మరీ ఒక ప్రాంతీయ పార్టీ అధినేత ఇంటికి ప్రధాని వెళ్తుండడం పట్ల రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మే 10వ తేదీ మధ్యాహ్నం ఈ చారిత్రాత్మక భేటీ జరగనుంది. ప్రధాని పర్యటన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ నివాస ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు అత్యంత కట్టుదిట్టం చేశారు. ఎస్పీజీ ఉన్నతాధికారులు ఇప్పటికే పవన్ కళ్యాణ్ నివాసాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, మూడు అంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ విందులో పాల్గొనే అవకాశం ఉంది. పవన్ కళ్యాణ్ పట్ల ప్రధానికి ఉన్న ప్రత్యేక గౌరవం, గత కొన్నేళ్లుగా వారి మధ్య కొనసాగుతున్న రాజకీయ సాన్నిహిత్యానికి ఈ పర్యటన ఒక నిదర్శనంగా నిలవనుంది. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీరిద్దరి మధ్య జరుగుతున్న తొలి వ్యక్తిగత భేటీ ఇదే కావడం విశేషం. ఈ భేటీ కేవలం మర్యాదపూర్వకమైనదిగానే కనిపిస్తున్నప్పటికీ, దీని వెనుక రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలు దాగి ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వెన్నెముకగా నిలిచే అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిధులు, , విభజన హామీల అమలుపై ప్రధానితో పవన్ కళ్యాణ్ చర్చించే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని కేంద్రం గుర్తించిందనే సంకేతం ఈ పర్యటన ద్వారా స్పష్టమవుతోంది. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాలకు అందవలసిన నిధులు, కేంద్రం నుంచి రావాల్సిన పారిశ్రామిక రాయితీలపై ఈ సమావేశంలో ఒక స్పష్టత వచ్చే వీలుంది. మరోవైపు, ఈ పర్యటన కూటమి పార్టీల మధ్య ఉన్న ఐక్యతను చాటిచెప్పడమే కాకుండా, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది. ఢిల్లీ పీఠం నుంచి మంగళగిరి గడప దాకా సాగుతున్న ఈ మైత్రి ముద్ర రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనుంది. కేంద్రరాష్ట్ర సంబంధాలు మరింత బలోపేతం కావడానికి, తద్వారా రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం పెరగడానికి ఈ భేటీ ఒక గట్టి పునాదిగా నిలుస్తుందని ఆశిస్తున్నారు. రేపు మధ్యాహ్నం జరగబోయే ఈ విశిష్ట సంఘటన కోసం యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విశ్వనగరంగా హైదరాబాద్




(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ ప్రధాన సమస్య అయిన ట్రాఫిక్‌ను శాశ్వతంగా పరిష్కరించడానికి కేవలం రోడ్ల విస్తరణే ఏకైక మార్గం కాదని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. నగరవాసులకు సులభతరమైన రవాణా మార్గాలను అందించేందుకు 'సిగ్నల్ ఫ్రీ' నగరం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం అత్యంత రద్దీ ఉండే కీలకమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్‌ల కలయికతో కూడిన వినూత్నమైన త్రీలెవల్ రవాణా విధానాన్ని అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీనికి తోడు వాహనదారుల ప్రధాన ఆందోళన అయిన పార్కింగ్ సమస్యను పారద్రోలేందుకు నగరవ్యాప్తంగా ఆధునిక సాంకేతికతతో కూడిన బహుళ అంతస్తుల (మల్టీ లెవెల్) పార్కింగ్ సముదాయాలను నిర్మించనున్నట్లు వెల్లడించారు. బహుళ విధానాల్లో రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయడం ద్వారా రోడ్ల పైనే గంటల తరబడి ట్రాఫిక్ లో చిక్కుకునే పరిస్థితి ఇక ముందు హైదరాబాద్ లో ఉండకూడదన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. సమగ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' మాస్టర్ ప్లాన్ విశేషాలను ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రాన్ని క్యూర్ , ప్యూర్ , రేర్ అనే మూడు అద్భుతమైన ఆర్థిక మండలాలుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న సుమారు 2,170 చదరపు కిలోమీటర్ల కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతాన్ని నెట్ జీరో (కాలుష్య రహిత) సిటీగా, సర్వీస్ సెక్టార్ హబ్‌గా మార్చనున్నారు. ఓఆర్ఆర్ వెలుపల నుంచి ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) లోపల ఉన్న పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతాన్ని పరిశ్రమలు మరియు తయారీ రంగాలకు (మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టార్) కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. ఇక ఆర్ఆర్ఆర్ బయట ఉన్న రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ ప్రాంతాన్ని పూర్తిగా వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికే అంకితం చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రణాళికల ద్వారా 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, తెలంగాణ శతాబ్ది ఉత్సవాల నాటికి (2047) 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని నిలపడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. నగరంలో కాలుష్య కోరలను కత్తిరించడానికి రవాణా వ్యవస్థలో గ్రీన్ మొబిలిటీని విపరీతంగా ప్రోత్సహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రణాళికలను ఉన్నతాధికారులు స్టాండింగ్ కమిటీకి వివరించారు. హైదరాబాద్ పరిధిలో ఆర్టీసీలో పూర్తిగా ఎలక్ట్రిక్ (ఈవీ) బస్సులను ప్రవేశపెడుతున్నామని, అంతేకాకుండా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తిరిగే పాత ఆటోలకు ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి వాటిని ఈవీ వాహనాలుగా మారుస్తున్నామని ప్రకటించారు. మరోవైపు దశాబ్దాలుగా కాలుష్య కూపంగా మారిన మూసీ నది ప్రక్షాళనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సవివరంగా తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను నగర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా అభివృద్ధి చేయబోతున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను పెంచే ఈ మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు దేశంలోనే ఒక విప్లవాత్మక నిర్ణయమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రశంసల వర్షం కురిపించింది. ఈ అద్భుతమైన విజన్ డాక్యుమెంట్‌ను కమిటీ సభ్యులకు అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం.. రాబోయే రోజుల్లో మహిళాభివృద్ధి, పట్టణాభివృద్ధి రంగాల్లో సాధించబోయే లక్ష్యాలను నిర్దేశించింది. ఈ సమగ్ర దార్శనికతను మాగుంట శ్రీనివాసులు రెడ్డి నేతృత్వంలోని కమిటీ ఎంతగానో అభినందించింది.

# ఏపీలో పలువురు ఐఏఎస్ ల బదిలీ

**అమరావతి, మహా :** రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న శశిభూషణ్ కుమార్ కు జలవనరుల శాఖ బాధ్యతలు అప్పగించింది. జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్, ఫుల్ అడిషనల్ ఛార్జ్ బాధ్యతల నుంచి సీఎస్ సాయి ప్రసాద్ కు ప్రభుత్వం రిలీఫ్ ఇచ్చింది. అటవీశాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది..

# ఎట్టకేలకు లైన్ క్లియర్




(మొదటిపేజీ తరువాయి)

ఈ చారిత్రక ఘట్టానికి ఆవిష్కర్తగా నిలవబోతున్నారు.

**చారిత్రక ఘట్టానికి సర్వం సిద్ధం**

"విజయ్ అను నేను... భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత కలిగి ఉంటానని దేవుని పేరిట ప్రమాణం చేస్తున్నాను" అనే గంభీరమైన వాక్యాలు ఆదివారం మధ్యాహ్నం సరిగ్గా 3 గంటలకు చెన్నై నగరంలో మార్మోగనున్నాయి. ఈ చారిత్రక ఘట్టానికి నగరంలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదిక కానుంది. ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేయనున్న ఈ అట్టహాసమైన ఉత్సవానికి అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను ముమ్మరంగా పూర్తి చేస్తోంది.

**మ్యాజిక్ ఫిగర్ దాటించిన మిత్రపక్షాలు**

ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, 108 స్థానాలకే పరిమితమై ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మ్యాజిక్ ఫిగర్ సాధించలేకపోయింది. ఈ దశలో రాష్ట్రంలో హంగ్ ఏర్పడుతుందా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే, ద్రావిడ పార్టీల ఆధిపత్యానికి ముగింపు పలకాలన్న ఉమ్మడి లక్ష్యంతో కాంగ్రెస్, వామపక్షాలు, ఐయూఎంఎల్ పార్టీలతో పాటు వీసీకే (విడుతలై చిరుతైగల్ కట్చి) కూడా బేషరతు మద్దతు ప్రకటించాయి. వీసీకే అధిష్ఠానం తమ అధికారిక మద్దతు లేఖను టీవీకే కీలక నేత ఆదవ అర్జునకు అందజేయడంతో కూటమి బలం ఏకంగా 120కి చేరి సుస్థిర సంకీర్ణ సర్కారుకు మార్గం సుగమమైంది.

*రాజ్‌భవన్‌లో రాజుకున్న వివాదం*

ఈ ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో రాజ్‌భవన్ వేదికగా చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర ఉత్కంఠను, ఆసక్తిని రేకెత్తించాయి. సీఎంగా బాధ్యతలు చేపట్టకముందే విజయ్‌కు పోలీసులు కాన్వాయ్ కేటాయించడంపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సరైన మెజారిటీ నిరూపించుకోకుండానే రాచమర్యాదలు ఎలా కల్పిస్తారంటూ ఉన్నతాధికారులను నిలదీయడంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ సజావుగా సాగుతుందా లేదా అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమైంది.

**ఉత్కంఠ పెంచిన గవర్నర్ షెడ్యూల్**

ప్రభుత్వ ఏర్పాటులో గవర్నర్ నిర్ణయం కీలకంగా మారిన తరుణంలో సాయంత్రం తీవ్ర హైడ్రామా నడిచింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం తమిళనాడు గవర్నర్ రాత్రి 7.10 గంటలకు కేరళ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. మద్దతు లెక్కలపై ఒకవైపు సస్పెన్స్ కొనసాగుతుండగానే, ఒకవేళ గవర్నర్ రాష్ట్రం దాటి వెళితే విజయ్ ప్రమాణ స్వీకారం మరింత ఆలస్యం అవుతుందన్న ప్రచారం జోరుగా సాగడంతో క్షణక్షణానికీ టెన్షన్ వాతావరణం నెలకొంది.

**అనూహ్య మలుపు.. అధికారిక ఆమోదముద్ర**

సరిగ్గా ఈ క్షణాల్లో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ అనూహ్యంగా తన కేరళ పర్యటనను రద్దు చేసుకుని, సాయంత్రం 6.30 గంటలకు విజయ్‌కు అపాయింట్‌మెంట్ ఖరారు చేశారు. దీంతో వెంటనే తన ఎమ్మెల్యేల మద్దతు లేఖలతో రాజ్‌భవన్‌కు వెళ్లిన విజయ్, ప్రభుత్వ ఏర్పాటుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కూటమి బలనిరూపణ పత్రాలను నిశితంగా పరిశీలించిన గవర్నర్.. నిన్నటి వరకు కాన్వాయ్‌ను తప్పుబట్టినప్పటికీ, అధికారికంగా టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు లాంఛనంగా ఆమోదముద్ర వేశారు.

**చెన్నైలో జనసంద్రం.. పండుగ వాతావరణం**

గవర్నర్ నుంచి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి లభించిన క్షణం నుంచే చెన్నై మహానగరం జనసంద్రంగా మారింది. తమ అభిమాన నాయకుడు ముఖ్యమంత్రిగా పీఠం ఎక్కుతున్న అపురూప ఘట్టాన్ని చూసేందుకు రాష్ట్రంలోని మారుమూల గ్రామాల నుంచి సైతం అభిమానులు ప్రత్యేక రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాల్లో తరలివస్తుండటంతో నగరమంతా కోలాహలంగా మారింది. ప్రధాన కూడళ్లన్నీ పసుపు, ఎరుపు రంగులతో కూడిన టీవీకే జెండాలు, విజయ్ భారీ కటౌట్లతో నిండిపోయి పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

**మిత్రపక్షాలకు మంత్రివర్గంలో చోటు**

ముఖ్యమంత్రిగా దళపతి విజయ్ ప్రమాణ స్వీకారం చేసే సమయంలోనే ఆయనతో పాటు కొందరు కీలక నేతలు మంత్రులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. తొలి విడత మంత్రివర్గ విస్తరణలో సంపూర్ణ మద్దతు తెలిపిన కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే ఇతర మిత్రపక్షాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించేలా విజయ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. పరిపాలనలో అందరినీ కలుపుకుపోయే దిశగా, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని మంత్రుల ఎంపిక ప్రక్రియను పార్టీ వర్గాలు దాదాపుగా పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

**సరికొత్త ఇన్నింగ్స్.. పరిపాలనా సవాళ్లు**

సినిమాల్లో తన అద్భుత నటనతో కోట్లాది మందిని మెప్పించిన విజయ్.. ఇప్పుడు వాస్తవ రాజకీయాల్లో పరిపాలకుడిగా తన కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నారు. యువతకు ఉపాధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల కల్పన వంటి ఎన్నికల హామీలను నెరవేర్చడం ఆయన ముందున్న ప్రధాన కర్తవ్యం. అదే సమయంలో మిత్రపక్షాలతో సమన్వయం చేసుకుంటూ, బలమైన ప్రతిపక్షాల విమర్శలను దీటుగా ఎదుర్కొంటూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సి ఉంది.

# ప్రధానమంత్రి కార్యక్రమాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

**హైదరాబాద్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించనున్న పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవం, హైదరాబాద్‌పనాజీ ఎకానమిక్ కారిడార్‌లోని గుడెబల్లూర్‌మహబూబ్‌నగర్ నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ పనులను హైదరాబాద్ హెచ్‌ఐసీసీ వేదికగా ప్రధానమంత్రి ఆదివారం వర్చువల్‌గా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ కేంద్ర ప్రభుత్వం తరఫున జాతీయ రహదారుల శాఖ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

# రిజిస్ట్రేషన్ల రద్దీ



(మొదటిపేజీ తరువాయి)

ప్రజల సౌకర్యార్థం రాష్ట్రంలో అత్యంత రద్దీగా ఉండే 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనివేళలను పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 12వ తేదీ (మే 12) నుంచి ఈ ప్రత్యేక సమయపాలన అమలులోకి రానుంది. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్.ఓ, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇకపై ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు నిరంతరాయంగా రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయి. కొనుగోలుదారుల రద్దీని బట్టి అవసరమైతే ఈ పదిహేను కార్యాలయాల్లో పనివేళలను మరింత పొడిగించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

పనివేళల పెంపుతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా తక్షణమే పెంచాలని ఉన్నతాధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. కేవలం ఈ 15 ఆఫీసుల్లోనే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ల రద్దీ అకస్మాత్తుగా పెరిగిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఎప్పటికప్పుడు గుర్తించి, అక్కడి అవసరాలకు అనుగుణంగా తక్షణమే అదనపు సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఇక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలోనూ రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా చూసేందుకు ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సాఫీగా కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పారదర్శకత, వేగం, ప్రజలకు గరిష్ట సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉద్ఘాటించారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రణాళికలు అమలు చేయాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతును మంత్రి పొంగులేటి ఆదేశించారు.

# పశ్చిమ బెంగాల్‌లో కమల వికాసం

(మొదటిపేజీ తరువాయి)

సువేందు అధికారి శనివారం అట్టహాసంగా బాధ్యతలు చేపట్టారు. కోల్‌కతాలోని ప్రసిద్ధ బ్రిగేడ్ గ్రౌండ్‌లో వేలాది మంది అభిమానులు, ఎన్డీయే మద్దతుదారుల హర్షధ్వానాల మధ్య రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయనతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఒకప్పుడు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా మెలిగిన సువేందు అధికారి.. ఇప్పుడు రాజకీయ రణరంగంలో ఆమెనే మట్టికరిపించి ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. సువేందు అధికారితో పాటే బీజేపీ శాసన సభ్యులు దిలీప్ ఘోశ్, అగ్నిమిత్రా పాల్, అశోక్ కీర్తనియా, నితీశ్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడూ తదితరులు రాష్ట్ర మంత్రులుగా ప్రమాణం చేశారు.

ఈ చారిత్రాత్మక ప్రమాణ స్వీకారోత్సవానికి దేశవ్యాప్తంగా ఉన్న ఎన్డీయే అగ్రనేతలు తరలివచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులు ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో పాటు పలు ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు ఈ కార్యక్రమానికి వన్నె తెచ్చారు. ప్రమాణ స్వీకారానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాబోయే ముఖ్యమంత్రి సువేందు అధికారి ఒకే వాహనంలో వేదిక వద్దకు చేరుకున్నారు. దారిపొడవునా ఎన్డీయే మద్దతుదారులు మోదీకి అనుకూలంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ హోరెత్తించగా, ఉభయులూ వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం వేదిక వద్ద ఏర్పాటు చేసిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి ప్రధాని మోదీ ఘనంగా నివాళులర్పించారు. ఈ ప్రధాన కార్యక్రమానికి ముందు పలువురు కళాకారులు సంప్రదాయ దుస్తుల్లో చేసిన నృత్య ప్రదర్శనలు, సంగీత వాయిద్యాల ఆలాపనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ అట్టహాసపు వేడుకలో ఒక అత్యంత ఆసక్తికరమైన, భావోద్వేగభరితమైన సన్నివేశం చోటుచేసుకుంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ.. వేదికపై ఉన్న ఒక వృద్ధుడి వద్దకు వెళ్లి ఆయన పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం అందరి దృష్టినీ ఆకర్షించింది. బెంగాల్‌లో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న శుభతరుణంలో, ఆ రాష్ట్రానికి చెందిన 98 ఏళ్ల బీజేపీ సీనియర్ నేత మఖన్‌లాల్ సర్కార్‌ను కమలదళం ప్రత్యేకంగా ఈ వేడుకకు ఆహ్వానించింది. వేదికపై ప్రధాని మోదీ స్వయంగా ఆయనకు శాలువా కప్పి అత్యంత గౌరవంగా సత్కరించి, పాదాభివందనం చేశారు. స్వతంత్ర భారతంలో జరిగిన జాతీయోద్యమంలో మఖన్‌లాల్ కీలక పాత్ర పోషించారు. మరీ ముఖ్యంగా 1952లో కాశ్మీర్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీతో కలిసి జాతీయ ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా, అక్కడ భారత జాతీయ జెండాను ఎగురవేసిన సాహసోపేత ఘటనలో ఆయన జైలు జీవితం కూడా గడిపారు. అలాంటి త్యాగధనుడిని ప్రధాని గౌరవించిన తీరు సభికుల కరతాళ ధ్వనుల మధ్య ప్రత్యేకంగా నిలిచింది.

బాధ్యతలు చేపట్టడానికి ముందు సువేందు అధికారి 'ఎక్స్' వేదికగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఉద్వేగభరితమైన సందేశాన్ని పంచుకున్నారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా సాగిన దుర్వినియోగ పాలనకు నేటితో ముగింపు పలుకుతున్నామని, ఇది 'సోనార్ బంగ్లా' (బంగారు బెంగాల్) యుగానికి అధికారిక ఆరంభమని ఆయన ప్రకటించారు. బెంగాల్‌కు ఇది ఒక చారిత్రాత్మక ఉదయమని, విజనరీ నాయకుడైన ప్రధాని మోదీకి 'సిటీ ఆఫ్ జాయ్' (కోల్‌కతా) లోకి స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత బెంగాల్‌లో ఏర్పడుతున్న తొలి బీజేపీ ప్రభుత్వం ద్వారా పార్టీ స్థాపకుల కలలను సాకారం చేస్తున్నామని, ఇకపై అభివృద్ధి, శాంతి, సుసంపన్నత లక్ష్యాలుగా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు.

ఇటీవల ముగిసిన 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 207 స్థానాలను కైవసం చేసుకుని ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. 15 ఏళ్లుగా నిరాటంకంగా అధికారంలో ఉన్న టీఎంసీ కేవలం 80 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ ఎన్నికల్లో నందిగ్రామ్, భవానీపూర్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన సువేందు అధికారి.. భవానీపూర్‌లో అప్పటి సిట్టింగ్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై 15 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించి జెయింట్ కిల్లర్‌గా నిలిచారు. అంతేకాకుండా, 1971 తర్వాత కలకత్తాయేతర జిల్లా నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మొదటి వ్యక్తిగా సువేందు అధికారి సరికొత్త చరిత్రను లిఖించారు.

## జనగణన-2027 విజయవంతానికి
# ప్రతి ఒక్కరూ సహకరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ప్రతి ఒక్కరూ సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలి
- డిసిసి అధ్యక్షులు, కూడా చైర్మన్ ఇనగాల




**మహా, వరంగల్ బ్యూరో;** జనగణన2027లో భాగంగా నిర్వహించనున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం ఐఎంఏ హాల్ లో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ వో విజయలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన అత్యంత కీలకమని తెలిపారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే విధానమే సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. మే 10, రాత్రి 12.00 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ముగియనున్నందున ప్రతి ఒక్కరు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. 11 నుండి జనగణన ఇంటింటి సర్వే ఉంటుందని ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, వనరుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో జనగణన సమాచారం కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు. ప్రజలు సరైన వివరాలను నమోదు చేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కూడా చైర్మన్ మాట్లాడుతూ జనగణన ఎన్యుమరేషన్ ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని వారు పేర్కొన్నారు. జిల్లా జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించడంలో కూడా జనగణన ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు ఈ జనగణనను తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాల్సిందిగా వారు పేర్కొన్నారు. ఐ ఎం ఏ హాల్ నుండి పోచమ్మ మైదాన్ వరకు జనగణన పై నిర్వహించిన అవగాహన ర్యాలీ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, అదనపు కలెక్టర్ జి. సంధ్య రాణి, టి ఆర్ వో విజయలక్ష్మి, జెడ్పిసిఓ రామిరెడ్డి, సిపిఓ చంద్రకళ, మండలాల తాసిల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- **హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**
- **స్వీయ జనగణన, విద్యా వారోత్సవాల పై ప్రత్యేక దృష్టి**




**మహా వరంగల్ బ్యూరో;** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, జనగణన, విద్యా వారోత్సవాల నిర్వహణపై శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. స్వీయ జనగణనకు ఒక్కరోజే గడువు మిగిలి ఉన్నందున ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ స్వీయ గణనలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ జిల్లాలో జనగణన స్వీయ నమోదు ప్రక్రియను సోమవారం సాయంత్రం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా స్వీయ గణన పూర్తి చేసుకోవాలని సూచించారు. విద్యా వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ, పాఠశాలల్లో విద్యా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, విద్యార్థులకు ఉపయోగపడే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లను కూడా సమర్థవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ వారంలో సుమారు 70 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని అదనపు కలెక్టర్ను ఆదేశించారు. అకాల వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు, నిల్వ సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ధాన్యం సేకరణ అనంతరం వెంటనే మిల్లులకు తరలించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ వ్యవస్థలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. డేటా ఎంట్రీ ప్రక్రియ కూడా ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించి రైతులకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్ రవి, డిఆర్డీఓ మేన శ్రీను, డిసిఓ సంజీవ రెడ్డి, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, విద్యాశాఖ, మునిసిపల్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### ప్రతి కుటుంబం సెల్ఫ్ ఎన్యుమరేషన్
# వివరాలు నమోదు చేయాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో;** 2027 జనగణనలో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ స్వీయ జనగణనకు ఈ నెల 10వ తేదీ రాత్రి 12 గంటల వరకు మాత్రమే అవకాశం ఉన్నందున, వరంగల్ జిల్లా ప్రజలందరూ తప్పనిసరిగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ప్రజలు ఇంటి వద్ద నుంచే సులభంగా https://se.census.gov.in వెబ్‌సైట్ ద్వారా స్వీయ గణన పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేయవచ్చని, తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని కుటుంబ వివరాలను నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన ఈ స్వీయ జనగణన కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగియనున్నందున, ఇంకా నమోదు చేయని వారు వెంటనే ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కలెక్టర్ కోరారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముందుగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి స్థాయి జనగణన చేపడతారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారని తెలిపారు. దేశ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పన, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలు, వనరుల సమర్థవంతమైన పంపిణీకి జనగణన అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు కూడా తమ ప్రస్తుత నివాసం నుంచే వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జనగణన సందర్భంగా కుటుంబానికి సంబంధించిన పూర్తి మరియు సరైన వివరాలను అందించాలని ప్రజలను కోరారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, అది కేవలం జనాభా లెక్కల కోసం మాత్రమే వినియోగించబడుతుందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక ఎన్యుమరేషన్ ఐడి లభిస్తుందని, ఆ ఐడీ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. స్వీయ జనగణనకు ఒక్కరోజే గడువు మిగిలి ఉన్నందున, జిల్లా ప్రజలందరూ బాధ్యతగా పాల్గొని ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగి అబ్బులు మృతి..

నివాళులర్పించిన కార్మిక నేతలు..



**మణుగూరు, మహా :** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని నందమూరి నగర్ గ్రామానికి చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగి, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘ నాయకులు చొల్లంగి వెంకటేశ్వరరావు (అబ్బులు) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి హైదరాబాదులో వైద్య చికిత్సలు పొందుతూ మృతి చెందారు. శనివారం అబ్బులు పార్థివ దేహం వద్ద పలువురు నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, ఐఎన్‌టీయూసీ మణుగూరు ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వత్సవాయి కృష్ణంరాజు, రామ్ సత్యనారాయణ, పాటి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు గోపిశెట్టి శివయ్య, టీడీపీ నాయకులు వాసిరెడ్డి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



### భారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి, టీఎస్ఐఐసీ ఎండీకి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఆదివారం ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం భారత ప్రభుత్వ టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీలం శామి రావు, టీఎస్ఐఐసీ ఎండీ శశాంకా శనివారం వరంగల్‌కు రాగా, హరిత కాకతీయ హోటల్‌లో హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వారిని మర్యాదపూర్వకంగా స్వాగతించి పూల మొక్కను అందజేశారు.

# రాళ్ల బంధం వాగుపై వంతెన నిర్మించండి



మంత్రి శ్రీనివాసరెడ్డికి గ్రామస్తులు వినతి

**నేలకొండపల్లి, మహా :** మండలం లోని చెరువు మాధారంమంగాపురంతండా గ్రామాల మధ్య ఉన్న రాళ్ల బంధం వాగు పై వంతెన నిర్మించాలని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి వినతి. పత్రంను అందించారు. మండలం లో శనివారం కోరట్లగూడెం పర్యటనలో భాగంగా మంత్రి ని కలిసి వివిధ సమస్యల పై వినతి పత్రం ను అందించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విద్యుత్ సంస్థ డీఈఈ ధీరావత్ కోటేశ్వరరావు మాట్లాడారు... తాము విన్నవించిన సమస్యలను సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. చప్టా పై వంతెన, నందిగామ కెనాల్ పై నూతన బ్రిడ్జి. కొత్త రహదారి ని నిర్మాణం' చేపట్టాలని కోరారు. మంత్రి శ్రీనివాస రెడ్డి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. గ్రామస్తుల తరుపున మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరువు మాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ, మట్టా దుర్గాప్రసాద్ రెడ్డి, పాల్తీయా రాజా, మార్కెట్ కమిటి చైర్మన్ సీతారాములు, శాఖమూరి రమేష్, బచ్చలకూరి నాగరాజు, అంజిని, సత్యనారాయణ, కడియాల నరేష్, మేకల వెంకటేశ్వర్లు, బోయిన వేణు, నంబూరి రామారావు, పాకనాటి కన్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్, ఆనం వెంకటరెడి. కర్ల ఆశోక్, మందడి నాగశ్రీను. వుల్లోజి ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా బొడ్రాయి మహోత్సవ కార్యక్రమం

పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



**మహా :** వరంగల్ లోని బిఆర్ నగర్ ప్రజలందరూ కలిసి ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న నూతన బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అటవీ, పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరైయ్యారు. ఈ సందర్భంగా బొడ్రాయికి విరాళంగా మంత్రి కొండా సురేఖ లక్ష రూపాయలు అందించడం జరిగింది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించి వేదమంత్రాలు నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రతిష్ట కార్యక్రమాలు సాగాయి. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతకు బలాన్నిస్తాయని సాంప్రదాయాల పరిరక్షణతో పాటు సంస్కృతి వారసత్వాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు..

**వైభవంగా శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం: పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని రాంపూర్ గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ టెంకాయ కొట్టి విగ్రహ ప్రతిష్ట స్థాపనకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. దేవాలయాల్లో పరిశుభ్రతకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పరిశుభ్రత ఎక్కడ ఉంటుందో అక్కడే దేవతలు ఆ సీనులావుతారని మంత్రి సురేఖ గారు తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలు ఉన్నప్పుడే భక్తులు భగవంతునిపై మనసును లగ్నం చేసే పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. అలాగే 19వ డివిజన్ కాశీబుగ్గలోని శ్రీ సీతారామాంజనేయ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ స్వాములకు అన్నదానం (బిక్ష) కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం హనుమాన్ స్వాములకు అన్నదానం (బిక్ష) కార్యక్రమంలో పాల్గొని హనుమాన్ స్వాములకు కొండా సురేఖ గారు గారు స్వయంగా అన్నదానం (భిక్ష) వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని త్వరలో ఆలయ స్థలములో కళ్యాణ మండపం కట్టడం జరుగుతుందని తెలిపారు.

### చలో హైదరాబాద్ – మోడీ బహిరంగ సభను
# విజయవంతం చేద్దాం

బూర్గంపాడు మండలంలో విస్తృతంగా కరపత్రాల పంపిణీ



**బూర్గంపహాడ్ మహా :** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేడు తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బూర్గంపాడు మండలంలోని పలు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలను సభకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, ఫిలిం బోర్డు సభ్యుడు కన్యదారి వరప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ బాలునాయక్, జిల్లా కార్యదర్శి బిజ్జం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చుక్కపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. మే 10న తెలంగాణకు ప్రధాని మోడీ రాకమూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా నరేంద్ర మోడీ తెలంగాణకు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా రూ. 7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి, మరికొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. ముఖ్య అభివృద్ధి కార్యక్రమాలుజహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగుడెబెల్లూరు - మహబూబ్‌నగర్ జాతీయ రహదారి అభివృద్ధి పనులుకాజీపేట - పెద్దపల్లి బైపాస్ రోడ్ల నిర్మాణంకాజీపేట - విజయవాడ 3వ రైల్వే లైన్ శంకుస్థాపనటెక్స్టైల్ పార్క్ నిర్మాణ పనుల ప్రారంభంపరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభహైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పేరేడు గ్రౌండ్స్‌లో బీజేపీ తెలంగాణ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభలో ప్రధాని మోడి తెలంగాణ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ "సబ్కా సాథ్ - సబ్కా వికాస్" నినాదంతో దేశ అభివృద్ధి కోసం ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని, రహదారులు, రైల్వేలు, వైద్య, విద్యా రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు

# పివి కాలనీలో నాగుపాము కలకలం..

రెస్క్యూ చేసిన ప్రాణదార ట్రస్ట్ సభ్యుడు ముజఫర్



**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియాలోని పివి కాలనీ క్వార్టర్స్‌లో నాగుపాము ప్రత్యక్షమవడంతో స్థానికులు శుక్రవారం ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. క్వార్టర్స్ పరిసరాల్లో పాము సంచరిస్తుండటాన్ని గమనించిన నివాసితులు వెంటనే ప్రాణదార ట్రస్ట్ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ప్రాణదార ట్రస్ట్ సభ్యుడు మొహమ్మద్ ముజఫర్ ఘటనాస్థలానికి చేరుకుని జనావాసాల మధ్య ఉన్న నాగుపామును ఎంతో చాకచక్యంగా, సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం ఆ పామును సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా మొహమ్మద్ ముజఫర్ మాట్లాడుతూ వర్షాకాలం లేదా వాతావరణ మార్పుల సమయంలో పాములు జనావాసాల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు భయంతో పాములను చంపకుండా, వెంటనే శిక్షణ పొందిన స్నేక్ క్యాచర్లకు లేదా ప్రాణదార ట్రస్ట్ సభ్యులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పాములు పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.





### కియా సైరోస్ ను లాంచ్ చేసిన
# డీసీసీ అధ్యక్షులు ఇనగాల

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ నగరంలోని ములుగు రోడ్డులో గల మాలిక్ కియా షోరూంలో కియా సంస్థ రూపొందించిన సరికొత్త మోడల్ 'కియా సైరోస్ కారును హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇనగాల కారు ఫీచర్ల ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పూర్తి భద్రతా ప్రమాణాలతో కూడిన వాహనాలను కియా సంస్థ వారు సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. కియా సైరోస్ కారు వినియోగదారులకు మంచి అనుభూతిని అందిస్తుందని ఆకాంక్షించారు.

# మా ఆరోపణలు అవాస్తవాలు అయితే మాపై విచారణ జరిపించండి

- **మహా పత్రిక ఎఫెక్ట్**
- **రాష్ట్రీయ హిందూ పరిషత్**
- **దేవాలయాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలు , భూకబ్జాల పై మంత్రికి వినతి పత్రం**

**మహా వరంగల్ బ్యూరో;** ఇటీవల రాష్ట్రీయ హిందూ పరిషత్ వారు దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత పై చేస్తున్న అభియోగాలు అవినీతి ఆరోపణల కథనాలు వాస్తవాలకు నిజరూపమైన మహా పత్రికలో ప్రచురించబడ్డాయి. ఈ అంశం నేరుగా మంత్రికి వినతి పత్రం రూపంలో చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ , ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను హన్మకొండ రాంనగర్ లోని వారి నివాసంలో రాష్ట్రీయ హిందూ పరిషత్ మర్యాదపూర్వకంగా కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాలయాలలో అధికారుల నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న అవినీతి, అక్రమాలు, భూకబ్జాల పై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రీయ హిందూ పరిషత్ మంత్రికి వినతి పత్రం ఇచ్చే క్రమంలో శ్రీ భద్రకాళి ఈవో, డీసి అధికారి పై మీరు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రికి రాష్ట్రీయ హిందూ పరిషత్ సభ్యులకు మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకోగా ఇందుకు రాష్ట్రీయ హిందూ పరిషత్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్ తో పాటు రాజు మాట్లాడుతూ మేం చేసిన ఆరోపణలు సాక్షాదారాలతో సహా నిరూపిస్తామని అలాగే మాపై వచ్చిన ఆరోపణలకు మేము ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని మంత్రికి తెలుపగా మంత్రి స్పందిస్తూ మీరు చేసిన ఆరోపణల పై పూర్తి విచారణ చేపడుతామని వారికి హామీ ఇచ్చినట్లు సమాచారం. అనంతరం మండల భూపాల్ మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా దేవాలయాల ఆచార వ్యవహారాలను , దేవాలయాలను , ఆలయాల భూములను సంరక్షించడంలో సంబంధిత మంత్రిగా ఎంతో బాధ్యత ఉందని అందుచేత పై తెలిపిన అంశాల పై శనివారం తమరికి దేవాలయ అధికారులు, భూ కబ్జాదారులు చేస్తున్న అవినీతి ఆక్రమణలను , దేవాదాయ శాఖ లో అధికార దుర్వినియోగం , పరిపాలన నిర్లక్ష్యం పై , ఆక్రమణల పై పూర్తి సాక్షాదారాలతో సంబంధిత మంత్రిగా మీకు అందించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ధర్మ కార్యాచరణ చేస్తున్నప్పుడు అవినీతిపరులు , భూకబ్జాదారులు అవినీతి అక్రమాలకు అడ్డుగా వస్తున్నామని మా పై తప్పుడు అభియోగాలను , ఆరోపణ చేస్తుంటారు, వారి తప్పుడు ప్రచారానికి భయపడేది ఏమాత్రం లేదని సంబంధిత శాఖల మంత్రిగా వాస్తవాలను గ్రహించి పైన చేస్తున్న అభియోగాలను పూర్తి స్థాయి విచారణ చేసినప్పుడు ఎవరు ఏంటిది అన్నది తమరికే తెలుస్తుందని, పారదర్శకమైన విచారణకు ఆదేశిస్తారని రాష్ట్రీయ హిందూ పరిషత్ ఆశిస్తుందని అంతేకాకుండా అవినీతి ఆక్రమణల పై కఠిన చర్యలు తీసుకునే వరకు విశ్రమించేది లేదని తమరికి సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.




# ఏమన్నారు మేడం..

కోమలి ప్రసాద్ గురించి ప్రస్తుత కుర్రకారు ప్రత్యేక పరిచయం అవసరం లేదు.. తన అందచందాలతో అందరిని ఆకట్టుకుంటుంది. ఈ చిన్నది 24 ఆగస్ట్ 1995న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జన్మించింది ..తరువాత కర్ణాటకలోని బళ్లారిలో పెరిగింది.కోమలి ప్రసాద్ అహ్మద్‌నగర్‌లోని ప్రవర ఇన్‌స్టిట్యూడ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో డెంటిస్ట్రీని పూర్తి చేసింది.2016లోనేను 'సీతాదేవి' అనే తెలుగు సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. తర్వాత 2017లో నెపోలియన్ సినిమాలో కనిపించింది.ఈమె సినిమాలే కాకుండా లూజర్‌లో, ఫైండింగ్ యువర్ పెంగ్విన్‌లో, మోడరన్ లవ్ హైదరాబాద్ అనే వెబ్ సిరీస్ లో కూడా నటించింది. తర్వాత అడివి శేష్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన హిట్ 2 ది సెకండ్ కేస్ సినిమాలో వర్ష అనే ఓ పోలిస్ ఆఫీసర్ పాత్రలో నటించి బ్లాక్ బస్టర్ అందుకుంది.ఇక సోషల్ మీడియా విషయానికి వస్తే.. ఈ ముద్దుగుమ్మ ఎప్పటికప్పుడు తన క్రేజీ లుక్స్ ఇంస్టాగ్రామ్ లో షేర్ చేస్తూ కుర్రకారును ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

### రౌడీ గుండెలపై కాలు పెట్టిన కీర్తి సురేశ్..

# విజయ్ బర్త్ డే పోస్టర్!



విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమాల్లో రౌడీ జనార్ధన్ కూడా ఒకటి. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్, గ్లింప్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. విజయ్ బర్త్‌డే సందర్భంగా నేడు(మే 9) మరో కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో రిలీజ్ చేసిన పోస్టర్‌లో సీరియస్ లుక్‌లో కనిపించిన విజయ్.. కొత్త పోస్టర్ లవ్లీగా కనిపించాడు. 'ప్రపంచంతో పోరాడతాడు.. ప్రేమకు లొంగిపోతాడు' అంటూ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. అందులో విజయ్ వర్షంలో తడుస్తూ, చేతిలో తుపాకీ పట్టుకొని కూర్చొని ఉండగా.. అతని గుండెలపై ఒక అమ్మాయి కాలు పెట్టినట్లు ఈ పోస్టర్ డిజైన్ చేశారు. ఇందులో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నారు. తొలిసారి తూర్పుగోదావరి యాసలో విజయ్ మాట్లాడబోతున్నాడు. 80వ దశకం నేపథ్యంలో కథనం సాగుతుంది. ఈ ఏడాది చివరిలో ఈ చిత్రాన్ని విడుదల చేసే అవకాశం ఉంది.

# బర్త్ డే స్పెషల్..

## సాయి పల్లవి గురించి 10 ఆసక్తికర విషయాలు

**తనదైన నటన, డ్యాన్స్ తో సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ సాయిపల్లవి.ఎక్స్ పోజింగ్‌కు దూరంగా ఉంటూ కేవలం తన నటనతోనే లక్షలాది మంది అభిమానులను సంపాధించుకుంది.ఈ రోజు(మే 9) ఈ నేచురల్ బ్యూటీ పుట్టిన రోజు. ఈ సందర్భంగా సాయి పల్లవి గురించి 10 ఆసక్తికర విషయాలు.**



1) సాయి పల్లవి పూర్తి పేరు సాయి పల్లవి సెంథామరై కన్నమ్. 1992 మే 9న తమిళనాడులోని కోటగిరిలో జన్మించింది. తల్లి రాధామణి పుట్టపర్తి సాయిబాబా భక్తురాలు కావడంతో ఆమె పేరులో సాయి చేర్చింది. ఈమె, చెల్లెలు పూజ కవల పిల్లలు. జార్జియాలోని ప్రముఖ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదివింది.
2) ఎనిమిదో తరగతిలో ఉండగా ఈమె నాట్యం చూసిన ఓ దర్శకుడు ధూం ధాం అనే తమిళ సినిమాలో కథానాయిక కంగనా రనౌత్ పక్కన చిన్న పాత్రలో అవకాశమిచ్చాడు.
3) సాయి పల్లవి మాతృభాష బడగ. ఆమెకు బడగ భాషతో పాటు తెలుగు, తమిళ, హిందీ, మలయాళం,ఇంగ్లిష్, జార్జియన్ భాషలు వచ్చు. ఇండస్ట్రీలో ఏ హీరోయిన్‌కి ఇన్ని భాషలు రావు.
4) 2015లో విడుదలైన 'ప్రేమమ్' సినిమాతో సాయి పల్లవి తన సినీ కెరీర్ ను ప్రారంభించింది.
5) 2009లో తెలుగులో ఢీ షోలో పాల్గొని ఫైనల్ వరకు వెళ్లింది. కస్తూర్తి మాన్(2005), ధామ్ ధూమ్(2008) సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా చేసింది
6) ఫిదా చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి..తొలి సినిమాతోనే భారీ హిట్ అందుకుంది. ఇందులో అచ్చం తెలుగింటి అమ్మాయిలా కనిపించి ఆకట్టుకుంది పల్లవి. ఈ సినిమాలో సాయిపల్లవి తెలంగాణ యాసలో మాట్లాడుతూ ప్రేక్షకులను ఫిదా చేసింది.
7) సాయి పల్లవి మిగతా హీరోయిన్లలా గ్లామరస్ రోల్స్ చేయదు. అలాగే ఎన్ని కోట్లు ఇస్తామన్నా సరే బ్యూటీ ప్రొడక్ట్‌స్‌ని అడ్వర్టైజ్ చేయదు. ఈ విషయాన్ని ఆమె గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.
8) సాయి పల్లవి డాక్టర్ కావాలనుకుంది. అయితే క్రమంగా ఆమెకు నటనపై ఆసక్తి పెరిగింది. దాంతో సినిమాల్లో నటించాలని నిర్ణయించుకుంది.
9) సాయి పల్లవి సోదరి పూజా కన్నన్ కూడా గతంలో ఓ తమిళ సినిమాలో నటించింది. 2024లో ఆమె వివాహం జరిగింది.
10) ప్రస్తుతం నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మూవీ 'రామాయణ'లో సీతగా నటిస్తోంది. రాముడి పాత్రను రణ్‌బీర్ కపూర్ పోషిస్తున్నాడు.



# నా బాయ్ ఫ్రెండ్ అమ్మాయిల పిచ్చోడు..

తమిళ చిత్ర పరిశ్రమ ద్వారా గుర్తింపు పొంది, తెలుగులోనూ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నటి ప్రియా భవానీ శంకర్. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే ఈ భామ, తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి వస్తున్న రకరకాల వార్తలపై తాజాగా స్పందించారు. ముఖ్యంగా ఆమె వ్యక్తిగత జీవితం, గత కొంతకాలంగా వినిపిస్తున్న బ్రేకప్ రూమర్స్ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాలేజీలో తాను ఓ అబ్బాయిని ప్రేమించానని.. కానీ అతడికి అమ్మాయిల పిచ్చి ఉందని.. ఎంతో మంది అమ్మాయిలతో ఎఫైర్స్ ఉన్నాయని చెప్పుకొచ్చింది. అలాంటి టాక్సిక్ బంధంలో తాను ఎక్కువ రోజులు ఉండలేకపోయానని.. అందుకే అతడికి బ్రేకప్ చెప్పానని.. అలాంటి బంధం అవసరం లేదని తెలిపింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. న్యూస్ రీడర్ గా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ప్రియా భవానీ శంకర్. బుల్లితెరపై సీరియల్స్ ద్వారా పాపులర్ అయ్యారు. ఆ క్రేజ్‌తో వెండితెరపై అడుగుపెట్టి 'మేయాద మాన్', 'కడైకుట్టి సింగం' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో సంతోష్ శోభన్ సరసన 'కళ్యాణం కమనీయం', విశ్వక్ సేన్ పక్కన 'గామి' చిత్రాలలో నటించి మెప్పించారు. ఇప్పుడు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034